క్లుప్తంగా

పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న గంటా అప్పలరాజు

నెల్లిమర్ల: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ బొత్స సందీప్‌కు చెందిన ధీర ఫౌండేషన్ తరఫున వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా అప్పలరాజు నెల్లిమర్ల శాఖా గ్రంథాలయానికి సోమవారం వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. అలాగే గ్రంథాలయంలో సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తి కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం జరజాపుపేట గ్రామీణ గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అవసరమైన పుస్తకాలను అందజేసినట్లు అప్పలరాజు తెలిపారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తాం

నెల్లిమర్ల: జూట్ మిల్లు యాజమాన్యం పీఎఫ్ బకాయిలు చెల్లించక పోతే విధులు బహిష్కరిస్తామని జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు స్పష్టం చేశారు. ఈ మేరకు పీఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ స్థానిక జూట్ మిల్లు గేట్ వద్ద సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 వరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, జూట్ యాజమాన్యం ఇంతవరకు పీఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులకు పెన్షన్ విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమయంలో యాజమాన్య ప్రతినిధులు వచ్చి 2022 డిసెంబర్ వరకు పీఎఫ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వంట పాత్రల పరిశీలన

నెల్లిమర్ల: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ఎండీఎం నిర్వాహకులకు అందజేసేందుకు మండలానికి వచ్చిన వంటపాత్రలను ఎండీఎం పర్యవేక్షణ అధికారి కె. రవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత పెంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన వంటపాత్రలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ యు. సూర్యనారాయణ, ఎండీఎం జిల్లా అధికారులు సత్యం, కె. రామకృష్ణ, సీఓ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ ఈ నెల 19న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలతో వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం: పైడితల్లి జాతర ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ విజయనగరం డివిజన్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా సరఫరా ఉండదని పేర్కొన్నారు. లంకాపట్నం, కమ్మవీధి 11 కేవీ ఫీడర్స్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కమ్మవీధి, కొలగట్ల వారి వీధి, సాలివీధి, కొణిసివీధి, అద్దేపల్లి వారి వీధి, నందివీధి, మండపం జంక్షన్, పులిగెడ్డ వారి వీధి, కుమ్మరవీధి, శుద్దవీధి, లంకాపట్నం, స్వీపర్ కాలనీ, హుకుంపేట, కొత్తపేట ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తులకు ఆటంకం కలగకుండా చర్యలు

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి అన్నారు. సోమవారం రాత్రి ఆలయం పరిసరాలను ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తుల క్యూ లైన్లలో టెంట్‌లు, మ్యాట్‌లు వేయిస్తున్నామన్నారు. నిరంతరం తాగునీరు, పర్వదినాల్లో మజ్జిగ, చిన్నారులకు పాలు అందజేసే విధంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. లడ్డూ ప్రసాదాలను విక్రయించేందుకు ప్రత్యేకంగా భవనం కేటాయించామని, పెద్ద పెద్ద బ్యానర్లతో భక్తులకు కనపడేవిధంగా కౌంటర్లు రూపొందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పతివాడ వెంకటరావు, తాడ్డి సురేష్, డాక్టర్ ఎస్.అచ్చిరెడ్డి, సింహాచల దేవస్థానం సూపర్‌వైజర్ పిళ్లా శ్రీనివాస్, ఆలయ సిబ్బంది రామారావు, మణికంఠ, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా..
ప్రజల చెంతకు వైద్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రూపాయి ఖర్చు లేకుండా ప్రజల చెంతనే వైద్య సేవలందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవరం స్థానిక బాబామెట్టలోని ఆరో నంబర్ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే పౌష్టికాహారం విలువను వివరించే విధంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపుతున్న శ్రద్ధ మరువరానిదన్నారు. నగరంలో ఇప్పటివరకు ఆరు శిబిరాలు జరిగాయని, వీని ద్వారా సుమారు 4,000 మంది వైద్య సేవలను పొందారని తెలిపారు. దీర్ఘకాలిక రోగులను గుర్తించి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేఏపీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం.. జగనన్న లక్ష్యం..

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విజయనగరం మండలం కొండకరకాం గ్రామలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నో వినూత్న కార్యక్రమాలతో ఆరోగ్య విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పునాది వేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రాథమిక వైద్యం నుంచి ప్రత్యేక (స్పెషలిస్టు) వైద్యం వరకు గ్రామాల్లోనే అందిస్తూ కొత్త చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఒక్కో మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను ఏర్పాటు చేసి వైద్యాన్ని గ్రామీణ ప్రజల చెంతకు చేర్చారని చెప్పారు. జిల్లా వాసుల సుదీర్ఘ కలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని కొనియాడారు.

దేశంలోనే ప్రత్యేక కార్యక్రమం: ఎంపీపీ

జగనన్న ఆరోగ్య సురక్ష దేశంలోనే ప్రత్యేక కార్యక్రమమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ ఆరోగ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. వృద్ధులకు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఎస్టీ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, సర్పంచ్ రమ్య, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఖరీదైన వైద్యం

నెల్లిమర్ల రూరల్: పేద ప్రజలకు అందుబాటులో ఖరీదైన వైద్యాన్ని చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని జోగిరాజుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠనాయుడు, ఎంపీడీఓ రామారావు, వైద్యులు సాయిరాం, సాయి నందిని, సర్పంచ్ మత్స శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నేత మత్స శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజలదే బాధ్యత..

దెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నాడలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నిటి తమ్మునాయుడు, జొన్నాడ, ఆకులపేట సర్పంచ్‌లు కోరాడ రమణి, సువ్వాడ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, మోపాడ, దెంకాడ పీహెచ్‌సీ డాక్టర్లు పీవీవీ యోగితాబాల, పావని, వివిధ విభాగాల డాక్టర్లు, అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు

భోగాపురం: ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రాజాపులోవలో నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దనే అందుతోందన్నారు. 438 మంది రోగులను పరీక్షించి ఐదుగురిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశామని వైద్యుడు టి. తిరుపతిస్వామి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కిలారి వెంకటరమణ, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, వైద్యులు సహన సంతోషి, నవీన్, పీవీ అనూష, సత్యవతి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్ : జోగిరాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుధారాణి, తదితరులు



విజయనగరం రూరల్: వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, పక్కనే ఎంపీపీ అప్పలనాయుడు



దెంకాడ: జొన్నాడలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: రాజాపులోవలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

విజయనగరం రూరల్: ఏటీఎం విధానంలో పలు రకాల పంటలను పండించడం ద్వారా రైతులకు నిరంతర ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ అధికారి (ఆర్‌టీఎల్) ప్రకాశరావు తెలిపారు. మండలంలోని జొన్నవలసలో ఏటీఎం విధానంలో పంటల సాగుపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు హాజరుకాగా ఆయన సమక్షంలో వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఏటీఎం విధానంలో పలు రకాల పంటలు, తీగజాతి, ఆకు కూరలు, కూరగాయల పంటలతో పాటు చుట్టూ మొక్కజొన్న, జామ, బంతి, కంది, మునగ వంటి పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఆనందరావు, ఆర్‌టీఓ హేమసుందర్, ఐసీఆర్‌పీఎస్ ఎల్1 మహేష్, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎస్ఎఫ్ఏలు, పీఈలు హాజరయ్యారు.

గౌరవ వేతనాలు పెంచాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విజయనగరం పూల్‌బాగ్: మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే గౌరవ వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.రంగరాజు, బుగత అశోక్, ఉంగరాల జయలక్ష్మి, పెంకి లక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి..

విజయనగరం పూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలి గౌరినాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. ఆదిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి. శంకరరావు, కెల్ల సూరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు



దెంకాడ: పెదతాడివాడలో ర్యాలీ చేస్తున్న అధికారులు, పొదుపు సంఘాల మహిళలు

విజయనగరం రూరల్: చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల బాలికలు సామాజికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. సెర్ప్ సీఈఓ ఆదేశాల మేరకు మండలంలోని కొండకరకాంలో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాలు చేయమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీపీ అప్పలనాయుడు మాట్లాడుతూ, బాలికల పట్ల తల్లిదండ్రులు వివక్ష చూపరాదని, బాలికలకు ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.తిరుపతినాయుడు, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, సర్పంచ్ కిలారి రమ్య, ఏసీ రాజ్‌కుమార్, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి..

దెంకాడ: రాష్ట్రంలో బాల్య వివాహాలు జరగకుండా స్వయం సహాయక సంఘాలు కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలవలస, పెదతాడివాడ, మోదవలస గ్రామాల్లో బాల్య వివాహాల రహిత సమాజం కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులు మానవహారం ఏర్పడడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ఏపీఎం వివరించారు. కార్యక్రమంలో సీసీలు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం

పూసపాటిరేగ: బాల్య వివాహాలతో విలువైన జీవితాలు నాశనం అవుతున్నాయని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలు అరికట్టాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల పుట్టిన బిడ్డలు అంగవైకల్యం, మానసిక సమస్యలతో ఇబ్బంది పడతారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసురావు, రొంగలి మహేష్, సర్పంచ్ టి. సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

అందరి బాధ్యత...

నెల్లిమర్ల రూరల్: ఎంతో విలువైన బాలికల బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని జోగిరాజుపేటలో కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, ఎంపీడీఓ రామారావు, వైద్యులు సాయిరాం, సాయి నందిని, యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నారాయణమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహారంపై అవగాహన తప్పనిసరి

విజయనగరం అర్బన్: విద్యార్థులు ఆరోగ్యకర ఆహారంపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరామములనాయుడు అన్నారు. స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'మంచి ఆహార పదార్థాలు - వాటి ప్రయోజనాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ, నేటి చిన్నారులకు మంచి ఆహారం పట్ల అవగాహన లోపించడం, జంక్ ఫుడ్స్ పట్ల వ్యామోహం పెరగడం మంచి పరిణామం కాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, సూర్యలక్ష్మి, భార్గవి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి..

విజయనగరం అర్బన్: రైతులు నిర్మించుకున్న మినీ గోకులాల బిల్లులను తక్షణమే చెల్లించాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట గోకులం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఏడాది కిందట కొంతమేర బిల్లులు చెల్లించిన అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోయారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సంఘ నాయకులు మిడతన పరదేశినాయుడు, కొట్యాన అప్పల నాగేశ్వరరావు, ముమ్ములూరి ఈశ్వరరావు, గొల్లు చంద్రరావు, కిలపర్తి సత్తిబాబు, రొంగళి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణలు



విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం దుర్గాదేవీ వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గాజులరేగ సాలివీధిలో అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రదీప్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవి బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితుడు వెలువపల్లి నరసింహమూర్తి అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే సిటీ బస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారు గాయత్రీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 25 శిరస్సుల దుర్గమ్మ రైల్వేస్టేషన్ రోడ్డు గాడీఖానా ప్రాంతంలో గాడీఖానా యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ చూపరులను ఆకట్టుకుంటుంది. 25 శిరస్సులతో అమ్మవారు శక్తిస్వరూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ దీక్షాదారులు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహిస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం సింగం చెరువులోకి చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మంజూరు చేసిన చేపపిల్లలను సోమవారం మండల కేంద్రంలోని స్థానిక సింగం చెరువులో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి జీవనోపాధి నిమిత్తం సుమారు రూ.1,50 లక్షలతో మండలానికి 84 వేల ఫింగర్, లింగు సైజు చేప పిల్లలను మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని సుమారు 50 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం మత్స్యకారులు, ఆక్వా రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటోందని.. అందులో భాగంగానే సాగర మత్స్యకారులకు వేట నిషధ సమయంలో మత్స్యభరోసా పథకం ద్వారా రూ.10 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండ గత ప్రభుత్వంలో డీజిల్‌పై లీటర్‌కు రూ.6.03 పైసలు ఉన్న సబ్సిడీని నేడు 9 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షలు నుంచి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జిల్లా మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, మత్స్యకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న, ఎఫ్‌డీఓ చాందిని, డైరెక్టర్ నరసింహులు, సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, పడాల భాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కొమ్మూరు సుభోషణరావు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి

- డీఎస్పీ గోవిందరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనే బేధం లేకుండా స్నేహభావంతో కలిసి ఉండాలని డీఎస్పీ ఆర్. గోవిందరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కలిసిమెలిసి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ మధ్య కాలంలో ఎక్కువగా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, గురువులు సూచించిన మంచి మర్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం సమాజంలో నేడు జరుగుతున్న సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ప్రపంచ అనస్థీషియా డే



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు కూడా ఆరోగ్య సేవలు విస్తరించేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఎన్ఆర్ఐ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆస్పత్రుల్లో అనస్థీషియా నిపుణుల కొరత ఉందన్నారు. ఆ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, రమణారావు, చైతన్య, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.